




# ఈకాలం వార్త

THE HONEST TELUGU DAILY








సోమవారం 25- 05 - 2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :209 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల


# ఆల్చిప్పల కోసం నదిలో దిగి..

## ఒకే కుటుంబంలోని 8మంది మృతి



బెంగళూరు : కర్ణాటకలోని తత్తెహక్కలు నదిలో వేటకు దిగిన ఒకే కుటుంబానికి చెందిన 11 మంది గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. జాలర్ల సాయంతో 8మంది మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో 7మంది మహిళలు, ఒకరు పురుషుడు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో నదిలో ఆల్చిప్పలు విరివిగా దొరుకుతాయి. దీంతో భత్కళ తాలూకా సిరాలి గ్రామానికి చెందిన ఓ కుటుంబం (14మంది) ఉదయం 10గంటల సమయంలో ఆల్చిప్పల కోసం నదిలోకి దిగారు.

మిగతాది 2లో

# ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలిసి నడుస్తాం: రూబియో



మిగతాది 2లో

## ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించవద్దు

- ఈ ఏడాదిలోనే వరి రైతులకు రూ.45 వేల కోట్లు చెల్లించాం
- తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా అధికారులు వ్యవహరించవద్దు
- వర్షాలతో ధాన్యం తడిచినా కొనుగోలు చేయాల్సిందే



2లో

## 'డిజిటల్ అరెస్టు'తో.. వృద్ధురాలి నుంచి రూ.24 కోట్లు లూటీ



2లో

# కొనసాగుతున్న ఎండల తీవ్రత



## తూర్పుగోదావరి జిల్లాలో 48.3 డిగ్రీలు

- తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఏపీలో అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.
- ఈ మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 48.1, ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరంలో 47.3, కృష్ణా జిల్లా నందివాడలో 47.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

### ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు

చిట్యాల (తూర్పుగోదావరి జిల్లా) --- 48.3°C
పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా) --- 48.1°C
తణుకు (పశ్చిమగోదావరి జిల్లా) --- 48.1°C
కుక్కునూరు (ఏలూరు జిల్లా) --- 47.3°C
కూనవరం (పోలవరం జిల్లా) --- 47.3°C
నందివాడ (కృష్ణా జిల్లా) --- 47.1°C

17 జిల్లాల్లోని 174 మండలాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటాయి.

రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు ఇలాంటి పరిస్థితులే ఉంటాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

అత్యవసరమైతే తప్ప ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 మధ్య బయటకు రావద్దు. అప్రమత్తంగా ఉండండి.

### తెలంగాణలో..



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలం కుంచవెల్లిలో --- 46.5°C
మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వెల్గనూర్‌లో --- 46.4°C
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో --- 46.3°C

2లో

## విద్యార్థి మిత్ర కిట్లపై వైకాపాది తప్పుడు ప్రచారం: మంత్రి లోకేశ్



అమరావతి: విద్యార్థి మిత్ర కిట్లు నిలిపివేశామని వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. యూనిఫామ్, షూ, బ్యాగ్‌లు, పుస్తకాలు ఇవ్వడం లేదనేది తప్పుడు ప్రచారమని స్పష్టం చేశారు. పాఠశాలలు తెరిచే నాటికి పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తామన్నారు. యూనిఫామ్, బ్యాగులు, బూట్ల పంపిణీ నెలరోజులు ఆలస్యం అవుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా కిట్ల పంపిణీలో కాస్త ఆలస్యం జరుగుతోందన్నారు. అధికారుల ప్రకటనను వక్రీకరించడం జగన్ వంకరబుద్ధికి నిదర్శనమని విమర్శించారు.

## కాలినడకన తిరుమల చేరుకున్న రామ్మోహన్ నాయుడు దంపతులు



2లో

## మొక్క జొన్న కొనుగోళ్లపై సీఎం కీలక నిర్ణయం: మంత్రి తుమ్మల



2లో

హైదరాబాద్: మొక్క జొన్న కొనుగోళ్లపై కేంద్రం స్పందించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం ఇప్పటికే కేటాయించిన రూ.4వేల కోట్లకు అదనంగా మరో రూ.1800 కోట్లు.. సీఎం కేటాయించారని చెప్పారు. ఈ ఏడాది రబీ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్రంలో మొక్కజొన్న భారీ దిగుబడుల వచ్చిన నేపథ్యంలో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రూ.1100 కోట్లతో మొక్క జొన్న కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు.

## పాస్టర్ ఆనంద్ ఎస్సీ సర్టిఫికెట్ రద్దు..

### రాజపత్రం విడుదల చేసిన కలెక్టర్



2లో

బాపట్ల: బాపట్ల జిల్లా పిట్టలవానిపాలేనికి చెందిన పాస్టర్ చింతాడ ఆనంద్ ఎస్సీ సర్టిఫికెట్ రద్దు చేస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం రాజపత్రం విడుదల చేశారు. క్రైస్తవ మతం ఆచరిస్తున్న పాస్టర్ ఆనంద్ ఎస్సీ సర్టిఫికెట్ రద్దు చేయాలని కోరుతూ పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలేనికి చెందిన అక్కల రామిరెడ్డి ఫిర్యాదు చేశారు.

# ప్రభుత్వ పథకాలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం



- జూన్ 2 నుంచి ఇందిరమ్మ బీమా పథకం అమలు: భట్టి విక్రమార్క
- రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు పథకం ద్వారా లాభం
- ప్రభుత్వ పథకాలపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోంది
- తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఇంటింటి ప్రచారం చేపడతాం
- కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజా సంక్షేమం దెబ్బతిందని భట్టి విమర్శ
- మహిళలకు వడ్డీలేని రుణాలపై గత ప్రభుత్వం హామీ నిలబెట్టుకోలేదన్నారు

ఖమ్మం కార్పొరేషన్: రాష్ట్ర అవతరణ వేడుకను పురస్కరించుకుని జూన్ రెండో తేదీ నుంచి ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేస్తున్నామని, తద్వారా రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టేందుకు త్వరలో ఇంటింటి ప్రచారం చేపడతామన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇస్తే, అనంతరం అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని పక్కనబెట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు.

2లో

# సంపాదకీయం

## చాయిస్ ఈజ్ యువర్స్ మిస్టర్ జగన్‌రెడ్డి!

ఒళ్లంతా బురద పులుముకున్న ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాను పూసుకున్న బురదను ఇతరులకు అంటించాలనుకుంటున్నారు.
తమ కుటుంబంలో జరిగిన మూడు మరణాలను ప్రస్తావించడం ద్వారా మళ్లీ సానుభూతి పొందాలని జగన్ ప్రయత్నిస్తున్నారేమో తెలియదుగానీ తమ కుటుంబ రక్త చరిత్రను ఆయనే బయటపెట్టుకున్నారు. రాజారెడ్డి (వైఎస్ తండ్రి) ఎలాంటి వారు? ఎన్ని నేరాలు చేశారు? వంటి విషయాలను తాను సీఎం అయ్యాక ప్రజలు మరచిపోయేలా రాజశేఖరరెడ్డి చేయగలిగారు.
పోయినోళ్లందరూ మంచోళ్లని సర్దుకుపోయే ఉదారవాదం మన నైజం కాబట్టే మరణానంతరం వైఎస్ 'మహానేతగా' మారిపోయారు. నిజానికి రాజారెడ్డి కంటే వైఎస్సే 'డేంజరస్' అని సీమకు చెందిన, మరీ ముఖ్యంగా కడపకు చెందిన ఆయన ప్రత్యర్థులు గజగజ వణుకుతూ వారికి ఎదురైన భయానక అనుభవాలను చెబుతుంటారు.వైఎస్ మరణాన్ని కొంతకాలం, వివేకానంద రెడ్డి హత్యను మరికొంత కాలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్న జగన్ రెడ్డి తాను తులసి మొక్కను అని చెప్పుకోవడాన్ని మించిన జోక్ మరేమి ఉంటుంది?మనం మంచివాళ్లం అవునా కాదా అన్నది ముందుగా మన కుటుంబ సభ్యులే సర్టిఫికెట్ ఇవ్వాలి. జగన్ ఉత్తమ మానవుడు అని వైఎస్ కుటుంబ సభ్యుల్లో ఒక్కరైనా సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వడం లేదన్న ప్రశ్నకు సమాధానం రావాలి కదా?నిజానికి వైఎస్ కుటుంబానికి ప్రారంభంలో ఆస్తిపాస్తులు పెద్దగా లేవు. రాజారెడ్డి తండ్రి వెంకటరెడ్డి చాలా చిన్న రైతు. రాజారెడ్డి ఫ్యాక్షన్ మార్గాన్ని ఎంచుకున్న తర్వాత వైఎస్ కుటుంబానికి ఆస్తులు సమకూరడం మొదలైంది. వైఎస్ సీఎం అయ్యాక జగన్ విన్యాసాలు చూశాం. ఈ దేశ చరిత్రలోనే ఎవరూ నిర్మించలేని విధంగా వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. పేర్ల పార్థసారథి రెడ్డి చెబుతున్నట్టుగా రాజారెడ్డి కుటుంబం రక్తపు కూడు తిని పెరిగిందన్న మాట!జగన్ గురువారం విలేకరుల సమావేశంలో నా పేరు కూడా ప్రస్తావించారు. పేరు ప్రస్తావనకే పరిమితం కాకుండా అమరావతిలో ప్లాట్ల కేటాయింపులో నా కుమారుడు, కుమార్తె అనుచిత లబ్ధి పొందినట్టుగా ఆరోపణలు చేశారు...నువ్వు ఆరోపణ చేయడం- నేను సమాధానం చెప్పడం కాదు గానీ, ఒక పని చేద్దాం! ప్లాట్ల కేటాయింపులో అధికారులను నేను గానీ, మా సిబ్బంది గానీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితం చేసినట్టుగా జగన్ అండ్ కో రుజువు చేస్తే సదరు ప్లాట్లను తిరుమల తిరుపతి దేవస్థానానికి విరాళంగా ఇచ్చేస్తాం. జగన్ అండ్ కో మాత్రమే కాదు ఇతరులు ఎవరైనా మేం అనుచిత లబ్ధి పొందినట్టు రుజువు చేసినా సదరు ప్లాట్లను వారికి ఉచితంగా ఇచ్చేస్తాం. మేం తప్పు చేసినట్టు లేదా అయాచిత ప్రయోజనం పొందినట్టు రుజువు చేస్తే సదరు ప్లాట్లను జగన్‌కి ఇవ్వడానికి కూడా మేము సిద్ధం.తాను చేసిన ఆరోపణలపై జగన్‌కు నమ్మకం ఉంటే ఈ సవాలును స్వీకరించాలి. లేదంటే, మానవ జాతి పరిణామ క్రమంలోనే జగన్ వంటి వ్యక్తి మరొకరు ఉండరని మేం భావించాల్సి ఉంటుంది.ఒళ్లంతా బురద పులుముకున్న ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాను పూసుకున్న బురదను ఇతరులకు అంటించాలనుకుంటున్నారు. మానవ జాతిలో తనను మించిన ఉత్తమ పురుషుడు మరొకరు లేరని భ్రమిస్తున్న ఆయన, తనను వ్యతిరేకించే వారందరూ అవినీతిపరులని, హంతకులని చిత్రించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. అయితే ఉగాది పంచాంగ శ్రవణంలో ఆయన పిలిపించుకున్న పండితుడు ఈ ఏడాది గ్రహబలం అనుకూలంగా లేదని చెప్పినట్టుగానే జగన్‌రెడ్డి గురువారంనాడు విలేకరుల సమావేశంలో చేసిన విన్యాసాలు ఆయనకే ఎదురు తగిలాయి. తన తాత రాజారెడ్డి హత్య, తండ్రి రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదాలను ప్రస్తావించడం ద్వారా జనం మరచిపోయిన విషయాలను ఆయన గుర్తుచేశారు. తమ కుటుంబంలో జరిగిన హత్యలతో పాటు కొన్ని దశాబ్దాలుగా తెలుగునాట జరిగిన అనేక హత్యల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని చెప్పే ప్రయత్నం చేయడం ద్వారా 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అనే సామెతను గుర్తుచేశారు. నిజానికి జగన్‌రెడ్డి తాత వైఎస్ రాజారెడ్డి గురించి ఈ తరానికి తెలియదు. ఆయనను ఎవరు.. ఎందుకు హత్య చేశారో కూడా తెలియదు. హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన రాజశేఖరరెడ్డిని మహా నేతగా భావిస్తున్న ఈ తరం వారికి ఆయనకు కూడా ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న సంగతి తెలియదు. ఇప్పుడు పాత విషయాలను ప్రస్తావించడం ద్వారా తండ్రీ తాతల నేపథ్యం గురించి ఈ తరం వారు తెలుసుకొనే పరిస్థితిని జగన్‌రెడ్డి కల్పించారు. వైసీపీ అంటే గొడ్డలి పార్టీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవలి కాలంలో తరచుగా చురకలంటిస్తున్నారు. దీంతో జగన్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి హత్యా రాజకీయాలకు చంద్రబాబు పెట్టింది పేరు అని, తాను మంచోడు కనుకే తాత రాజారెడ్డిని చంపినవాళ్లు ప్రశాంతంగా బతకగలుగుతున్నారని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. అయితే రాజారెడ్డి వర్గీయులు చేసిన హత్యాయత్నం నుంచి ప్రాణాలతో బయటపడి ఆ తర్వాత తన వర్గీయులతో రాజారెడ్డిని చంపించిన పేర్ల పార్థసారథిరెడ్డి అప్పుడేం జరిగిందో కుండబద్దలు కొట్టారు.మొదట రాజారెడ్డి వర్గీయులు తనపై దాడి చేసి చంపే ప్రయత్నం చేశారని, ఆ సందర్భంగా తన శరీరంపై 26 కత్తిపోట్లు పడ్డాయని, తాను చనిపోయాననుకొని వదిలి వెళ్లిపోయారని ఆయన వివరించారు. అనంతరం తన వర్గీయులు రాజారెడ్డిపై దాడి చేసి చంపారని ఆయన జరిగింది జరిగినట్టుగా చెప్పుకొచ్చారు. వైఎస్ కుటుంబం వల్ల తన కుటుంబం ఆర్థికంగా చితికిపోయిందని కూడా ఆయన ఏకరువు పెట్టారు. పార్థసారథిరెడ్డిపై జరిగిన హత్యాయత్నం, ఆ తర్వాత జరిగిన రాజారెడ్డి హత్య ఫ్యాక్షన్ రాజకీయాలలో భాగమే! దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఇవి జరిగాయి. అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారు. ఇప్పుడు నేను అంత మంచివాడిని, ఇంత మంచివాడిని అని చెప్పుకొంటున్న జగన్మోహన్‌రెడ్డి అప్పట్లో తన తాత రాజారెడ్డిపై దాడి చేసిన వారిని చంపాలనుకున్నారు. ఈ విషయాన్ని వైఎస్ రాజశేఖరరెడ్డి స్వయంగా అప్పటి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అందరూ కాకాగా పిలుచుకొనే దివంగత వెంకటస్వామి వద్ద ప్రస్తావించారు. 'మా నాన్నను చంపినవాళ్లను చంపుతానని మా వాడు కత్తి పట్టుకొని తిరుగుతున్నాడు. జరగరానిది జరిగితే నా రాజకీయ జీవితం దెబ్బతింటుంది. ఏదైనా సలహా ఇవ్వండి' అని కాకాను రాజశేఖరరెడ్డి అప్పట్లో కోరారు. ఈ విషయాన్ని దివంగత వెంకటస్వామి ఓ సందర్భంలో నా వద్ద ప్రస్తావించారు. 'నీ కొడుకుని పులివెందుల పరిసరాల్లో ఉండనివ్వొద్దు' అని తాను రాజశేఖరరెడ్డికి సూచించినట్టు కాకా తెలిపారు. దీన్నిబట్టి జగన్‌రెడ్డి ఇప్పుడు చెప్పుకొంటున్నట్టుగా అంత మంచోడు కాదని స్పష్టమవుతోంది. తండ్రి రాజశేఖరరెడ్డి అడ్డుపడి ఉండకపోతే జగన్‌రెడ్డి చేతులకు కూడా రక్తం అంటి ఉండేదన్నమాట! కత్తి చేతబట్టినవాడు ఆ కత్తికే బలవుతాడు అని అంటారు. అప్పట్లో రెండు వర్గాలకు నాయకత్వం వహించిన రాజారెడ్డి, పార్థసారథిరెడ్డి ఫ్యాక్షన్ దాడులు జరిపించారు. రాజారెడ్డి మరణించగా, పార్థసారథిరెడ్డి ప్రాణాలు దక్కించుకున్నారు. ఇదంతా గతం. నిజానికి గురువారంనాడు ఏబీఎన్ డిబేట్‌లో పార్థసారథిరెడ్డి పాల్గొనే వరకు ఆయనే రాజారెడ్డిని చంపిన వారికి నాయకుడు అని ఈ తరానికి తెలియదు. రాజారెడ్డి హత్యా రాజకీయాలు చేసేవారన్న విషయం కూడా తెలియదు. ఇప్పుడు జగన్‌రెడ్డి పుణ్యమా అని వైఎస్ కుటుంబ నేర చరిత్ర గురించి తెలుసుకొనే అవకాశం ఈ తరానికి లభించింది. 2019--2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో అమలైన 'రాజారెడ్డి రాజ్యాంగం' అంటే ఏమిటో ఇప్పుడు జనబాహుళ్యానికి మరింతగా అర్థమవుతోంది.

**పాపాలే.. శాపాలై!**

తన తండ్రి రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంపై ఇప్పటికీ అనుమానాలు ఉన్నాయని జగన్‌రెడ్డి తాజాగా చెప్పడం ఈ మొత్తం ఎపిసోడ్‌లో హైలెట్! ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి తన తండ్రి రాజశేఖరరెడ్డి మరణంపై అనుమానాలు ఉన్నాయని ఒక్కసారి కూడా చెప్పలేదు. నాటి సంఘటనపై విచారణ జరిపించే ఆలోచనా చేయలేదు. రాజశేఖరరెడ్డి మరణం వల్ల ప్రజల్లో పెల్లుబికిన సానుభూతిని తన రాజకీయ పరమపద సోపానానికి వాడుకున్న జగన్‌రెడ్డి, అధికారంలోకి రాగానే అన్నీ మరచిపోయారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజశేఖరరెడ్డి పేరు కూడా ప్రస్తావనకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రాజశేఖరరెడ్డి మరణం తర్వాత హెలికాప్టర్ ప్రమాదం వెనుక కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ హస్తం ఉందని కొంతకాలం, ఆ తర్వాత రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ హస్తం ఉందని మరికొంత కాలం ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు.

## 'డిజిటల్ అరెస్టు'తో.. వృద్ధురాలి నుంచి రూ.24 కోట్లు లూటీ

మొదటిపేజీ తరువాయి

డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ వృద్ధురాలి నుంచి రూ.కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్లను బెంగళూరు సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలి నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.24 కోట్ల నగదును నేరగాళ్లు దోచుకున్నట్లు గుర్తించారు. సైబర్ కేటుగాళ్లకు చెల్లించేందుకు బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టేందుకు బాధితురాలు బ్యాంకుకు వెళ్లగా.. సిబ్బంది అనుమానించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది.
బెంగళూరులోని శివాజీనగర్‌కు చెందిన ఓ వృద్ధురాలికి (74) ఇటీవల ఆస్తి విక్రయించడం ద్వారా భారీ మొత్తంలో నగదు సమకూరింది. ఈ విషయాన్ని పసిగట్టిన సైబర్ నేరగాళ్లు.. మనీలాండరింగ్ కేసు పెడతామంటూ ఆమెను బెదిరించడం మొదలుపెట్టారు. దీంతో భయాందోళనలకు గురైన ఆమె.. జనవరి నుంచి మే నెల మధ్య కాలంలో దాదాపు రూ.24 కోట్లను వారి ఖాతాలకు బదిలీ చేశారు.
షాపింగ్ కో హెల్పర్.. దిల్లీ స్టార్టప్‌పై నెట్టింట చర్చ
అక్కడితో ఆగని మోసగాళ్లు.. మరింత నగదు కోసం నేరగాళ్లు డిమాండ్ చేశారు. దీంతో తన వద్ద ఉన్న దాదాపు 1.3 కిలోల బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టేందుకు బాధితురాలు బ్యాంకుకు వెళ్లారు. అయితే, ఈ మధ్య ఆమె ఖాతా నుంచి భారీ మొత్తంలో నగదు లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించిన మేనేజర్.. అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన సైబర్ క్రైం పోలీసులు వృద్ధురాలిని విచారించారు.
భయంతో తొలుత అసలు విషయాన్ని దాచినప్పటికీ.. చివరకు 'డిజిటల్ అరెస్ట్' (ణఅస్త్రఝ్ఖుశ్రీ చాతీతీవర్) గురించి ఆమె పోలీసులకు వివరించారు. వెంటనే కేసు నమోదు చేసుకున్న అధికారులు.. ఈ విషయాన్ని విదేశాల్లో ఉన్న బాధితురాలి కుటుంబీకులకు తెలియజేశారు. ఈ కేసును తీవ్రంగా పరిగణించి ముమ్మర దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ముంబయి, అలహాబాద్, దిల్లీలకు చెందిన ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. దోచుకున్న నగదును దాదాపు 22 ఖాతాలకు బదిలీ చేసినట్లు గుర్తించారు. దాదాపు రూ.60లక్షలను ఫ్రీజ్ చేసిన అధికారులు.. మిగతా నగదు రికవరీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.
దీనిపై సమగ్ర విచారణ అనంతరం కలెక్టర్ శనివారం రాత్రి ఎస్సీ సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.
జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ సిఫార్సు ఆధారంగా, ఏపీ షెడ్యూల్ కులాలు..షెడ్యూల్ తెగలు..వెనుకబడిన వర్గాల కుల ధ్రువీకరణ పత్రాల రెగ్యులేషన్ చట్టం 1993, సాంఘిక సంక్షేమ శాఖ జీవో నంబరు 58 ప్రకారం తన అధికారాలను ఉపయోగిస్తూ రద్దు చేసినట్లు వినోద్‌కుమార్ రాజపత్రంలో పేర్కొన్నారు. పాస్టర్ ఆనంద్‌కు పిట్టలవానిపాలెం తహసీల్దారు 2021 మే 15, 2022 అక్టోబరు 22, 2025 ఫిబ్రవరి 2న జారీ చేసిన ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలు రద్దయ్యాయన్నారు.

## మొక్క జొన్న కొనుగోళ్లపై సీఎం కీలక నిర్ణయం: మంత్రి తుమ్మల

మొదటిపేజీ తరువాయి

పొద్దుతిరుగుడు పంట 25 శాతానికి మించి కొనుగోలు చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు మంత్రి తుమ్మల ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాల వారీగా మొజొన్న కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తుమ్మల స్పష్టం చేశారు.

## కొనసాగుతున్న ఎండల తీవ్రత.. తూర్పుగోదావరి జిల్లాలో 48.3 డిగ్రీలు

మొదటిపేజీ తరువాయి

తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఏపీలో అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 48.1, ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరంలో 47.3, కృష్ణా జిల్లా నందివాడలో 47.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 17 జిల్లాల్లోని 174 మండలాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటాయి. రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు ఇలాంటి పరిస్థితులే ఉంటాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అత్యవసరమైతే తప్ప ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 మధ్య బయటకు రావద్దని.. వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.
తెలంగాణలో..
తెలంగాణలో అత్యధికంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలం కుంచవెల్లిలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వెల్గనూర్‌లో 46.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్‌ను ఎన్నటికీ నమ్మలేం: ఉదయనిధి



డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఆ పార్టీ తమను వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. గత 20ఏళ్లుగా ఆ పార్టీ తమపై ఆధారపడి ఉందని.. ఈ రోజు అధికారం కోసం టీవీకేతో చేతులు కలిపిందని విమర్శించారు. ఈ విషయాన్ని ఎవరూ ఎప్పటికీ మర్చిపోవద్దని.. ఆ పార్టీ నేతలను భవిష్యత్తులో తమ దరిదాపుల్లోకి కూడా రానివ్వకూడదని సూచించారు. రాజకీయంగా తన ఉనికిని నిలుపుకోవడానికి కాంగ్రెస్ ఎంతటి దారుణానికి అయినా ఒడిగడుతుందని మరోసారి రుజువయ్యిందన్నారు.
దేశంలో భాజపా వరుస విజయాలకు ప్రధాని మోదీ, అమిత్ షాలే ప్రధాన కారణమని తాను ఇన్నాళ్లు భావించానని.. కానీ అది నిజం కాదని ఉదయనిధి అన్నారు. కాంగ్రెస్ నేతల అసమర్థత వల్లే ప్రజలు భాజపాకు పట్టం కడుతున్నారని.. అది ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. డీఎంకేతో పొత్తు వల్లే గతంలో కాంగ్రెస్‌కు రాజ్యసభ ఎంపీ, అసెంబ్లీ సీట్లు వచ్చాయన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూడా డీఎంకే కార్యకర్తల అవిశ్రాంత కృషి వల్లే ఆ పార్టీ ఐదు సీట్లు గెలుచుకోగలిగిందన్నారు. ఆ విశ్వాసం కూడా లేకుండా కాంగ్రెస్ నేతలు గెలిచిన వెంటనే అధికారం కోసం పరుగులు తీశారని మండిపడ్డారు. త్వరలోనే తమిళనాడు ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఎన్నికల్లో డీఎంకే (ణవీఖ) పరాజయం నేపథ్యంలో అంతర్గత పార్టీ వ్యూహాల్లో దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు.

## ఆల్చిప్పల కోసం నదిలో దిగి..

మొదటిపేజీ తరువాయి

అదే సమయంలో నది ప్రవాహం పెరగడంతో వారిలో ముగ్గురు కొట్టుకుపోయారు. వారిని రక్షించడానికి ప్రయత్నిస్తుండగా మిగిలిన వారు కూడా ప్రవాహంలో కొట్టుకుపోయారు. వెంటనే స్థానిక జాలర్లు నదిలోకి దిగి ముగ్గురిని రక్షించారు. అప్పటికే మిగిలిన వారు గల్లంతయ్యారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలిసి నడుస్తాం: రూబియో

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని, త్వరలో ఆ దేశ బృందం భారత్‌కు రాబోతోందని విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ తెలిపారు. భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగశాఖ మంత్రి రూబియోతో చర్చల అనంతరం.. దిల్లీలో సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. అమెరికాతో ఒప్పందంలోని కొన్ని అంశాలపై భారత్ అభ్యంతరం చెబుతోందన్నారు. 140 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాలే తమకు ముఖ్యమన్నారు.
గల్ఫ్ సంక్షోభం, రష్యా- ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించినట్లు రూబియో వెల్లడించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్- అమెరికా కలిసి నడుస్తాయన్నారు."భారత్, అమెరికా రెండూ ఉగ్రవాద బాధిత దేశాలే. ఈ రెండూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు. వ్యూహాత్మక భాగస్వాములు. భారత్‌లో పర్యటించడం గర్వంగా ఉంది" అని అమెరికా విదేశాంగ మంత్రి అన్నారు.
ప్రతి దేశంలో మూర్ఖులు ఉంటారు..
అమెరికా వలసదారులకు మిత్రదేశమని మార్కో రూబియో బలంగా చెప్పారు. అగ్రరాజ్యంలో భారతీయులపై వివక్ష చూపటాన్ని మూర్ఖుల చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రతి దేశంలో మూర్ఖులు ఉంటారని.. వారు దేశానికి ఉన్న విస్తృతమైన విధానాలకు ప్రాతినిధ్య వహించరని పేర్కొన్నారు. ఈ విషయంలో భారతీయుల ఆందోళనలను సీరియస్‌గా తీసుకొంటామని పేర్కొన్నారు. "వీటికి ఎలా స్పందించాలో అర్థం కావడంలేదు. కానీ, వీటిని తీవ్రంగా పరిగణిస్తాము" అని పేర్కొన్నారు. అమెరికా సమాజాన్ని , ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దడంలో భారతీయుల పాత్రను ఆయన కొనియాడారు. భారతీయులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు 20 బిలియన్ డాలర్ల వరకు సమకూర్చిన విషయాన్ని తాను అంగీకరిస్తానని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ అంకె ఇంకా పెరగాలని ఆశిస్తున్నట్లు వెల్లడించారు.

## కాలినడకన తిరుమల చేరుకున్న రామ్మోహన్ నాయుడు దంపతులు



మొదటిపేజీ తరువాయి

తిరుమల: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దంపతులు కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. కుమారుడు శివాన్ ఎర్రన్నాయుడి పుట్టువెంట్రుకల మొక్కు సందర్భంగా సతీమణి శ్రావ్యతో కలిసి శ్రీవారి దర్శనానికి వచ్చారు. అలిపిరి మెట్ల మార్గంలో ఉదయం 11 గంటలకు నడక ప్రారంభించిన రామ్మోహన్‌నాయుడు దంపతులు.. మధ్యాహ్నం 2 గంటలకు కొండపైకి చేరుకున్నారు. సతీమణితో కలిసి 1000మెట్లకు పైగా బొట్లు పెడుతూ రామ్మోహన్‌నాయుడు కొండపైకి వచ్చారు.
ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ నడకదారిలో వెళ్లే భక్తులకు తితిదే విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. తిరుమలలోని సదుపాయాలే కూటమి ప్రభుత్వ పనులకు ఉదాహరణ అని చెప్పారు. ఏపీలో సనాతన ధర్మవ్యాప్తికి, సంప్రదాయాల పరిరక్షణకు విశేష కృషి జరుగుతోందన్నారు. శ్రీవారిని రామ్మోహన్‌నాయుడు కుటుంబసభ్యులు సోమవారం దర్శించుకోనున్నారు.

## ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించవద్దు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రాష్ట్రంలో 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. 51 లక్షల టన్నుల ధాన్యం కొని రైతులకు చెల్లింపులు చేశామని చెప్పారు. ఈ ఒక్క ఏడాదిలోనే వరి రైతులకు రూ.45వేల కోట్లు చెల్లించామన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు.
"తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా అధికారులు వ్యవహరించవద్దు. వర్షాలతో ధాన్యం తడిచినా కొనాల్సిందే. ఫీల్డ్‌లో 21 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయి.. వాటికి కొరత లేదు" అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

## ప్రభుత్వ పథకాలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం

మొదటిపేజీ తరువాయి

స్తంభాద్రి పట్టణాభివృద్ధి సంస్థ (సుడా), ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన ఛైర్మన్‌లుగా బాధ్యతలు చేపట్టిన పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖాదర్‌బాబాల అభినందన సభ ఆదివారం ఖమ్మం నగరంలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంటే అదికాస్తా తమ కుటుంబానికే ప్రయోజనం చేకూరేలా కేసీఆర్ చేసుకున్నారని విమర్శించారు. మహిళలకు వడ్డీలేని రుణాలిస్తామని చెప్పిన భారాస ప్రభుత్వం మొండిచెయ్యి చూపిందన్నారు. కాంగ్రెస్ కండువా వేసుకొని గెలిచిన నాటి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, కందాళ ఉపేందర్‌రెడ్డి, హరిప్రియలు తమతో మాట్లాడుతూనే అప్పటి అధికార పార్టీలోకి చేరారన్నారు. ఉన్నత స్థానంలో ఉన్నవారు పార్టీలు మారారు తప్ప జెండాలు మోసే కార్యకర్తలెవరూ తమను వీడలేదన్నారు. వారందరికి ప్రస్తుతం పార్టీలో, ప్రజా ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యాన్ని పేదలకు ఉచితంగా అందిస్తున్నామని, గృహజ్యోతి పథకం కింద 53 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించనున్నట్టు వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మక్కలు కొనుగోలు చేస్తున్నట్టు, రైతులు పండించిన ప్రతి గింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. రైతుల సమస్యలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు మంత్రిమండలి సమావేశాల్లో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని గుర్తుచేశారు. ఇదీ మన అభివృద్ధి అని ప్రతి ఒక్కరూ చెప్పుకొనేలా ప్రభుత్వం ముందుకెళ్తున్నట్టు వివరించారు. మహిళా సంఘాలకు ఏటా రూ.20వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, దీన్ని రూ.లక్ష కోట్ల వరకు పెంచుతామని భట్టి హామీ ఇచ్చారు.

# విద్యా కమిషన్ నివేదికను పక్కన పెట్టారా..?

– ఆకునూరి మురళి రాజీనామాతో ప్రభుత్వంపై విమర్శలు
– ముఖ్యమంత్రి నైతిక బాధ్యత వహించాలని బీసీ సంఘంనాయకుడు భూపతి శ్రీనివాసరావు డిమాండ్




ఈకాలం

రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పుల కోసం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి విద్యా కమిషన్ నివేదికను ప్రభుత్వం పక్కన పెట్టిందనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి రాజీనామా చేయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగంలో సంస్కరణలు తీసుకురావాలనే ఉద్దేశంతో రాష్ట్రస్థాయి విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్ చైర్మన్‌గా విద్యావేత్త ఆకునూరి మురళిని నియమించి, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యా విధానాలను అధ్యయనం చేసి తెలంగాణకు అనుకూలమైన మార్పులను సూచించాల్సిందిగా బాధ్యతలు అప్పగించింది. కమిషన్ పలు రాష్ట్రాలను సందర్శించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్లు సమాచారం.అయితే కమిషన్ సమర్పించిన నివేదికను ప్రభుత్వం అమలు చేయకపోవడంతో పాటు అందులోని కీలక సూచనలను పక్కన పెట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆకునూరి మురళి తన పదవికి రాజీనామా చేయడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ అంశంపై స్పందించిన బీసీ సంఘం నాయకుడు భూపతి శ్రీనివాసరావు నాయుడు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర విద్యా కమిషన్ ఏర్పాటు కేవలం ప్రచారానికే పరిమితమైందని, కమిషన్ చైర్మన్ సూచనలకు ప్రాధాన్యం ఇవ్వకుండా అవమానకర పరిస్థితులు సృష్టించారని ఆరోపించారు. అనేక రాష్ట్రాలు సందర్శించి సమగ్ర అధ్యయనం చేసి ఇచ్చిన నివేదికను బుట్టదాఖలు చేశారని విమర్శించారు.విద్యా వ్యవస్థలో మార్పుల కోసం నిపుణుల అభిప్రాయాలను స్వీకరించాల్సిన ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరి కారణంగానే ఆకునూరి మురళి రాజీనామా చేయాల్సి వచ్చిందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వాలు కమిషన్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా వాటి నివేదికలను అమలు చేసే చిత్తశుద్ధి కూడా చూపాలని భూపతి శ్రీనివాసరావు నాయుడు అన్నారు. విద్యా రంగంపై నిర్లక్ష్యం భవిష్యత్ తరాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం కమిషన్ నివేదికను ప్రజలకు వెల్లడించి అమలు దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఇక ఈ అంశంపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తుండగా, అధికార వర్గాలు మాత్రం విద్యా రంగంలో ఇప్పటికే పలు సంస్కరణలు చేపడుతున్నామని పేర్కొంటున్నాయి. అయినప్పటికీ విద్యా కమిషన్ చైర్మన్ రాజీనామా వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అడవిలో ఎలుగుబంటి దాడి.. చెంచుగూడం మహిళకు తీవ్ర గాయాలు

– 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేసిన అటవీశాఖ అధికారులు

ఈకాలం

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండల పరిధిలోని కొండనాగుల ఈస్ట్ బీట్ పవన కుంట ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఎలుగుబంటి దాడి ఘటనలో చెంచుగూడెం గ్రామానికి చెందిన నిమ్మల సాలమ్మ భర్త నిమ్మల రాములు మేకల కాపలాకు అడవికి వెళ్లిన సమయంలో పిల్లలతో సంచరిస్తున్న ఎలుగుబంటి ఒక్కసారిగా ఆమెపై దాడి చేసింది. ఈ ఘటనలో సాలమ్మ తీవ్రంగా గాయపడటంతో అక్కడికక్కడే కుప్పకూలింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మల్లేశం,ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజు, మీనాక్షి లు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గాయపడిన మహిళను సురక్షితంగా బయటకు తీసుకువచ్చి అచ్చంపేటలోని మహదేవ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్, అచ్చంపేట చంద్ర శేఖర్ గారు అడవికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలకు హెచ్చరికలు





జారీ చేశారు. అడవిలో ఎలుగుబంట్లు, పులులు, చిరుతలు సంచరిస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితులు తప్ప అడవిలోకి వెళ్లవద్దని సూచించారు. ముఖ్యంగా పశువులు, మేకలు, గొర్రెల మేపు, కట్టెల సేకరణ కోసం అడవిలోకి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే అడవి జంతువులు కనిపించిన వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక సాహాయం: 5000/- రూపాయలు ఇవ్వడం జరిగింది.

# నందనవనం పార్క్ ను సద్వినియోగం చేసుకోవాలి

– ఫారెస్ట్ పార్క్ లో వాకింగ్ ట్రాక్ ను సుందరంగా తీర్చిదిద్దాలి
– కొత్తగూడెం సెంట్రల్ పార్క్ కు ధీటుగా నందనవనం పార్క్ ను తీర్చిదిద్దాలి
– డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల



ఈకాలం

పాల్వంచలోని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నందనవనం పార్క్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మండలం పరిధి బసవతారక కాలనీలోని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నిర్వహిస్తున్న నందనవనం పార్క్ లో పాల్వంచకు చెందిన పలు ప్రాంతాల వాకర్స్ ఆదివారం సందర్శించి, వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనీ, పరిపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ నడక, వ్యాయామం చేయాలన్నారు. నందనవనం పార్క్ అభివృద్ధి కోసం అందరూ సహకరించుకోవాలని కొత్వాల అన్నారు. పట్టణంలోని వాకర్స్ అందరిని ఒకే వేదికపై తెచ్చిన చీఎ 9 అధినేత ముత్తినేని శ్రీనివాసరావు ను, ఫారెస్ట్ అధికారులను, సిబ్బందిని కొత్వాల అభినందించారు ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, ఫారెస్ట్ అభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, బసవతారక కాలనీ సర్పంచ్ జర్పుల కాశమ్మ, సోములగూడెం సర్పంచ్, పలువురు కార్పొరేటర్లు, పలు ప్రాంతాలకు చెందిన వాకర్స్, ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హామీలు మరిచిన ఫుల్కల్ సర్పంచ్?




ఈకాలం

స్థానిక సంస్థల్లో గెలిచేందుకు ఇచ్చిన హామీలు మరిచారా సర్పంచ్ గారు అంటూ మండల కేంద్రం పుల్కల్ గ్రామానికి చెందిన ప్రజలు, రైతులు ప్రశ్నిస్తున్నారు. గ్రామానికి చెందిన ఏ ఆడపిల్ల కైనా సరే పెళ్లి కానుకగా పుస్తె మెట్టెలు అందజేస్తాం అన్నారు. కానీ సర్పంచ్ సి. లావణ్య గారుఅనుకున్న వ్యక్తులకు మాత్రమే పుస్తె మెట్టెలు అందజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి గ్రామంలో ఎవరైనా మరణిస్తే తక్షణసాయంగా అంత్యక్రి యల కోసం ఐదు వేలు అందజేస్తామని అది కూడా కొంతమందికే అందజేయడం ఎంతవరకు సమంజసం..? ఎన్నికల్లో గెలిచిన వెంటనే నెల రోజుల్లోపు రైతుల పొలాల వద్దకు మొరం వేయిస్తామని చెప్పి ఇప్పటివరకు పొలాల వద్దకు వెళ్లే రోడ్లకు మొరం వేయలేదన్నారు. అసలే వచ్చేది వానకాలం ఇంకెప్పుడు మొరం వేయిస్తారని సర్పంచ్ పై గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గెలిచేంతవరకు ఓడ మల్లన్న గెలిచిన తర్వాత బోడ మల్లన్న అన్న సామెత ఉంది సర్పంచ్ పరిస్థితి అంటూ గ్రామస్తులు వాపోతున్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు ఊరుకునే పరిస్థితి లేదని గ్రామస్తులు, యువకులు సిద్ధమవుతున్నారు.

# శ్రీశైలం ప్రాజెక్టు జెన్కో కాలనీలో చిరుత పులి సంచారం

– అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారుల సూచన

ఈకాలం



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం శ్రీశైలం ప్రాజెక్ట్ జెన్కో కాలనీ సమీపంలో ఆదివారం ఉదయం చిరుత పులి సంచారం కలకలం రేపింది. ఓ ఇంటి ముందు ఉన్న ఇనుప బాక్సులోనీ కోడిని తినేందుకు ప్రయత్నించింది. శ్రీశైలం ప్రాజెక్టు శివారు ప్రాంతాలలో ఈమధ్య తరచుగా చిరుతపులులు కనిపిస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళ అదే విధంగా తెల్లవారుజామున ప్రజలు బయటికి వచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. రాత్రి సమయంలో అవసరమైతేనే తప్ప బయట ప్రాంతాలలో సంచరించకూడదని తెలిపారు.

# ఊట కుంట చెరువు నుండి ఒండ్రు మట్టి అక్రమ రవాణా

ఇతర గ్రామాలకు తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్న గ్రామ యువకులు

ఈకాలం



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం ఐనోల్ గ్రామంలోని ఊట కుంట చెరువు నుండి అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గ్రామ సర్పంచ్ శంకర్ నాయక్ ఉపసర్పంచ్ మధు యాదవ్ కలిసి తరలిస్తున్నారని గ్రామ యువకులు ఆరోపిస్తున్నారు. ఇట్టి విషయం గ్రామ యువకులు మహేష్,రమేష్ దృష్టికి రావడంతో వారు వెంటనే స్పందించి ఒండ్రు మట్టిని తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. చేపల పెంపకానికి చెరువు పరిరక్షణకు ఉపయోగపడే వండుమాటిని ఇతర గ్రామపంచాయతీలకు ఎలా తరలిస్తారని గ్రామ యువకులు సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ ను ప్రశ్నించారు? గ్రామంలో ఉన్న మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తే ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సర్పంచ్ శంకర్ నాయక్ ను విలేకరులు వివరణ కోరగా తన ప్రమేయం లేకుండా చెరువులో మట్టి తీయడం జరిగిందని, సమాచారం తెలుసుకున్న మేము మట్టి తీయడాన్ని వెంటనే నిలుపుదల చేశామని మాపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని తెలిపారు.

# కంకర రోడ్డ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

– త్వరగా బిటి రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్తుల విజ్ఞప్తి

ఈకాలం



నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునుంతల మండలం తిప్పాపూర్ తండా గ్రామంలోకి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు తెలియజేశారు. తిప్పాపూర్ తండా నుంచి కాంసానిపల్లి తండాకి వెళ్లే దారిలో సంవత్సరం క్రితం కంకర పరిచిన కాంట్రాక్టర్ ఇంతవరకు బీటీ రోడ్డు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కంకర తేలి వాహనదారులు మరియు స్థానికులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడుచుకుంటూ వెళ్లే వారికి కంకర వల్ల ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. రాత్రి సమయంలో అయితే ప్రయాణం చేయడమే చాలా కష్టంగా ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీటీ రోడ్డు నిర్మాణ పనులు నత్త నడకలా సాగిస్తున్నారు తప్ప పూర్తి చేయడం లేదని మూడు గ్రామాలకు సంబంధించిన గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పై అధికారులు వెంటనే స్పందించి పెండింగ్ లో ఉన్న బీటీ రోడ్డు పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాగే ఉంటే రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.



# ఒట్టు... నేను రహస్యంగా పెళ్లి చేసుకోను!

నేను రహస్యంగా పెళ్లి చేసుకోను... ఇది నా ప్రామిస్ అంటున్నారు బాలీవుడ్ కథానాయిక కంగన. ఇటీవలే ఆమె 'క్వీన్' చిత్ర సీక్వెల్ కోసం రంగంలోకి దిగారని సన్నిహిత వర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఆమె వివాహిత మహిళ లుక్‌లో హడావుడిగా కారు ఎక్కుతున్న ఓ వీడియో నెట్టింట వైరల్ అయ్యింది. దీంతో కంగనా రహస్యంగా పెళ్లి చేసుకున్నారా? అంటూ సోషల్ మీడియాలో చర్చమొదలైంది. దీంతో కంగన తనదైనశైలిలో దీనికి సంబంధించి ఇన్‌స్టా సోరీలో బదులిచ్చారు.

"నేను చేస్తున్న క్యారెక్టర్ మేకప్‌లో ఉన్నప్పుడే ఎవరో నా ఫొటోను తీశారు. ఇప్పుడు నాకు చాలా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. కానీ, పెళ్లి చేసుకున్న మహిళగా కనిపించడంలో అంత పెద్ద విషయం ఏముంది? సినిమాల్లో నటీనటులు అన్ని రకాల పాత్రలు పోషిస్తారు. నేనేమి రహస్యంగా పెళ్లి చేసుకోను, ఇది నా ప్రామిస్" అని రాసుకొచ్చారు. కంగనా 'క్వీన్' మొదటి చిత్రంలో వివాహం రద్దయి విదేశాలకు వెళ్లిన మహిళగా కనిపించారు. ఇప్పుడు వైరల్ అయిన వీడియోతో ఆమె సీక్వెల్‌లో వివాహిత స్త్రీగా కనిపించి ప్రేక్షకుల్ని అలరించనున్నారని తెలుస్తోంది.

ఏదేమైనప్పటికీ కంగనా పాత్ర గురించి పూర్తి వివరాలు తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి ఉండాల్సిందే. కంగనా తదుపరి 'భారత భాగ్య విధాత' అనే చిత్రంతో వచ్చే నెల 12న ప్రేక్షకుల్ని పలకరించనున్నారు.




# ఈరోజును జీవితంలో మర్చిపోలేను - నాగార్జున స్పెషల్ పోస్ట్

తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు.

"అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా" అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్పుల్లో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే శివ, రక్షకుడుతోపాటు, 'కూలీ'లో పోషించిన సైమన్ లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నిటినీ గుర్తుచేసేలా 'కింగ్ 100' ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.



# 'జన నాయగన్' ఇప్పటికీ సెన్సార్ అవ్వలేదు: నిర్మాత

విజయ్ కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'జన నాయగన్'. సంక్రాంతి కానుకగా రావాల్సిన ఈ సినిమా ఇప్పటికీ విడుదలకు నోచుకోలేదు. సెన్సార్ విషయంలో కోర్టుల చుట్టూ తిరగ్గా, ఫైనల్ కమిటీ ఈ మూవీని చూసి, సర్టిఫికెట్ ఇవ్వాల్సిఉంది. ఈ ప్రక్రియ ఇప్పటికీ పూర్తికాలేదని నిర్మాత వెంకట్ కె.నారాయణ అన్నారు. విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ఈ వ్యవహారం ఓ కొలిక్కి రాకపోవడం గమనార్హం. తొలుత ఈ విషయమై స్పందించడానికి నిర్మాత నారాయణ సంశయం వ్యక్తంచేయగా, ఆ తర్వాత సెన్సార్ అవ్వలేదని స్పష్టంచేశారు."జన నాయగన్' గురించి మాట్లాడానికి ఇది సరైన వేదిక కాదు. నేను ఆలయ దర్శనానికి వచ్చాను. కానీ, ఒక విషయం చెప్పాలనుకుంటున్నా. ఇప్పటికీ సెన్సార్ సర్టిఫికెట్ రాలేదు. దానికోసమే వేచి చూస్తున్నాం. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించి, సినిమాను ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తాం. ఇంతకుమించి మాట్లాడటానికి ఇది వేదిక కాదు" అని అన్నారు.

# అలాంటోడిని ఎవరూ ఓడించలేరు: పూరి జగన్నాథ్



ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ 'పూరి మ్యూజింగ్స్' పేరిట ఆసక్తికర విషయాలు పంచుకుంటున్న సంగతి తెలిసిందే. తాజా ఎపిసోడ్‌లో యాటిట్యూడ్ గురించి మాట్లాడారు. రైట్ యాటిట్యూడ్ ఉన్నోడిని ఎవరూ ఓడించలేరంటూ స్ఫూర్తినింపే ప్రయత్నం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే?

"నీ యాటిట్యూడ్ వల్ల నీ చుట్టూ ఉన్న ప్రపంచం మారిపోదు. కానీ, నీలోని ప్రపంచం మారుతుంది. ఒక పెను తుపానులో రెండు ఇళ్లు సముద్రంలో కొట్టుకుపోయాయి. అన్నీ కోల్పోయి ఒకడు ఏడుస్తుంటే.. ఇంకొకడు ఏదో చెట్టు కొమ్మను పట్టుకుని వేలాడుతూ నవ్వుతూ కనిపిస్తాడు. ఒకడు కుంగిపోతాడు. మరొకడు బతికాననుకుంటాడు. మీకు నెగెటివ్ మైండ్ ఉంటే దీవెనలు కూడా దరిద్రంగా అనిపిస్తాయి. అదే మీరు కాన్షియస్ మైండ్ (స్పృహతో ఉన్న మనసు)తో ఉంటే కష్టాలు కూడా అవకాశాల్లా కనిపిస్తాయి. ప్రపంచంలో ఏదీ నీకు మాత్రమే వ్యతిరేకంగా జరగదు. ప్రపంచంలో ఏవేవో జరుగుతుంటాయి. అందులో నువ్వు కూడా ఉన్నావంతే. అలాంటప్పుడే మన యాటిట్యూడ్ సాయం చేస్తుంది. ఆ తుపానులో నువ్వు బాధ పడతావా? అనుభూతి చెందుతావా? అన్నది నీ ఇష్టం. ప్రతి దానికీ కంప్లైంట్ చేసుకుంటూ పోతే నీకే నష్టం.

ఎప్పుడూ ఏడుస్తూ బతకాలి అని అనుకున్న వారికి చుట్టూ వేల కారణాలు కనిపిస్తాయి. బయట జరిగేదేదీ మన చేతిలో ఉండదు. కానీ, దానిపై ఎలా స్పందించాలనేది మాత్రం మన చేతిలోనే ఉంటుంది. రైట్ యాటిట్యూడ్ ఉన్నోడిని ఎవరూ ఓడించలేరు. ఎందుకంటే వాడు జీవితానికి ఎదురెళ్లడు. జీవితమనే నదిలో ఒదిగిపోతూ కొట్టుకుపోతున్నాడు. వాడిని ఎవరూ ఏమీ చేయలేరు. వర్షంలో తడవాల్సి వస్తే తడువు. ఎండలో ఉండాల్సి వస్తే ఉండిపో. అప్పుడే నీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ప్రతి దానికీ భయపడే లక్షణం ఉంటే నెమ్మదిగా మార్చుకోండి. భయపడకపోతే ఇదే జీవితంలో మీ అనుభవం మరోలా ఉంటుంది. ఇక్కడ ఎవరూ పర్‌ఫెక్ట్ కాదు. మన క్యారెక్టర్ ఎలా ఉన్నా ఫర్వాలేదు. ఒరిజినల్‌గా ఉంటే చాలు. ఎవరి కోసమూ యాక్ట్ చేయాల్సిన పనిలేదు. మీ కాన్ఫిడెన్స్ లెవల్ మీ సింప్లిసిటీలో అర్థమవుతుంది. మన కష్టాలన్నింటినీ తట్టుకోవాలన్నా.. పడి లేవాలన్నా.. పరిగెత్తాలన్నా మనకు కావాల్సింది యాటిట్యూడ్" అని పేర్కొన్నారు.



# 'సలార్ 2' సెట్స్‌పైకి అప్పుడే!

ప్రస్తుతం ప్రభాస్ చేతిలో మూడు సినిమాలున్నాయి. వీటిలో 'ఫౌజీ' ముగింపు దశలో ఉండగా.. 'స్పిరిట్', 'కల్కి..' సీక్వెల్ చిత్రాలు ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించుకున్నాయి. దీనితో పాటు 'సలార్ 2' చేయాల్సి ఉండగా.. ఇది ఉంటుందా అనే దానిపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. ఇక ఇటీవల దర్శకుడు ప్రశాంత్ నీల్ తాను త్వరలో ఓ మైథలాజికల్ సినిమా చేస్తానని చెప్పడంతో 'సలార్' సీక్వెల్ ఉండకపోవచ్చేమోనన్న ప్రచారం మరింత ఊపందుకుంది. దీంతో ఈ అంశంపై దర్శకుడు ప్రశాంత్ స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం తాను ఎన్టీఆర్‌తో చేస్తున్న 'డ్రాగన్' పూర్తి కాగానే.. 'సలార్ 2' ప్రారంభమవుతుందని వెల్లడించారు. దీంతో ఇదిప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ప్రస్తుతం ప్రశాంత్ – ఎన్టీఆర్ కలయికలో వస్తున్న 'డ్రాగన్' సినిమా వచ్చే ఏడాది ఆరంభం కల్లా పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. ఈలోగా ప్రభాస్ కూడా 'ఫౌజీ'తో పాటు 'స్పిరిట్'ని ముగించే అవకాశముంది. కాబట్టి 'సలార్ 2: శౌర్యాంగపర్వం' 2027 చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్లొచ్చని సంకేతాలందుతున్నాయి.



# ఆదర్శకుటుంబంలోకి నివేద!

కథానాయకుడు వెంకటేశ్.. దర్శకుడు త్రివిక్రమ్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం 47'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. శ్రీనిధి శెట్టి కథానాయిక. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాలోకి కొత్తగా మరో అందం చేరినట్లు తెలుస్తోంది. నటి నివేదా పేతురాజ్ ఇందులో ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఇది త్రివిక్రమ్‌తో ఆమెకి రెండో సినిమా. తను గతంలో ఆయన దర్శకత్వంలో 'అల.. వైకుంఠపురములో' సినిమాలోనూ ముఖ్య పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఇక ప్రస్తుతం తుది దశ చిత్రీకరణలో ఉన్న ఈ 'ఆదర్శ కుటుంబం' అక్టోబరులో తెరపైకి వచ్చే అవకాశముందని ప్రచారం వినిపిస్తోంది. ఇది కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతోంది.



Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149